

రామాంజనేయపురంలో తక్కువగా మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



వేటపాలెం ప్రాథమిక పాఠశాల్లో 1,2,3 తరగతులు ఒకే గదిలో ఉన్న విద్యార్థులు



అద్దంకి నియోజకవర్గంలో అరకొరగా స్టూడెంట్ కిట్ పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సర్కారీ విద్య.. అంతా మిథ్య

- కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల తీరు అధ్వానం
- ఉపాధ్యాయుల సర్దుబాటు ఊసే ఎత్తని విద్యాశాఖ
- ఎండీఎం బిల్లుల పెండింగ్
- మధ్యాహ్న భోజన కార్మికులను భయపెడుతున్న టీడీపీ నాయకులు
- భారీగా ఉపాధ్యాయ ఖాళీలు

అద్దంకి: కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసింది. మళ్లీ గత తెలుగుదేశం హయాంలో ఉన్న పరిస్థితులు వచ్చాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు స్వర్ణయుగం వచ్చింది. నాడు–నేడు 1,2 దశల కింద పాఠశాలల్లో 9 అంశాల్లో అభివృద్ధి చేసి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చేశారు. ఇంగ్లిష్ మీడియం, జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, టోఫెల్, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద తదితర కార్యక్రమాలతో పాఠశాలలు కళకళలాడాయి. అంతటి వెలుగులు పొందిన సర్కారీ బడులు నేడు కళావిహీనంగా మారాయి. కానీ ఈవిద్యా సంవత్సరంలో ఇష్టానుసారంగా ఉపాధ్యాయులు సర్దుబాటు చేయడంతో విద్య బోధన అటకెక్కింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ సాయిలు తీర్చిదిద్దడం పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడంతో ప్రతి ఏటా అడ్మిషన్ సంఖ్య భారీగా పెరిగాయి. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్ లేవు అని బోర్డులు పెట్టిన పరిస్థితులు సైతం ఉన్నాయి. కానీ ఈఏడాది ఎక్కడ ఆ పరిస్థితి కనిపించ లేదు. పాఠశాలలు ప్రారంభమై 50 రోజులు దాటినా ఇప్పటికీ కొన్ని పాఠశాలలు విద్యా కానుక కిట్లు పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు.

మిడ్ డే మీల్స్ బిల్లుల పెండింగ్

చీరాల అర్బన్/వేటపాలెం: సర్కారు బడులకు పూర్వ వైభవం తీసుకువచ్చి కార్పొరేట్‌గా దీటుగా రూపురేఖలను గత ప్రభుత్వం మార్చేసింది. కార్పొరేట్ స్కూళ్లకు కన్ను కుట్టేలా పాఠశాలల భవన నిర్మాణాలు, మౌలిక వసతులతో కొత్త రూపును సంతరించుకున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసింది. అయితే ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో జరుగుతున్న నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. లక్షలు ఖర్చు చేసినా అవి విద్యార్థులకు సద్వినియోగం కావడంలేదనేది వాస్తవం. చీరాల మండలంలో ప్రాథమిక పాఠశాలలు 65, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 15 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 2556, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 548, ఉన్నత పాఠశాలల్లో 5007



వేటపాలెంలో నాడు-నేడు నిధులు లేక నిలిచిన హైస్కూల్ అదనపు తరగతి గదుల నిర్మాణం

మొత్తం 8111మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలల్లో 429 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 7818 మంది ఉండగా 2024-25 విద్యాసంవత్సరంలో 8111 మంది విద్యార్థులు ఉన్నారు. మండలంలో 81 కుకింగ్ ఏజన్సీలు ఉండగా రోజుకు 6376 మంది మధ్యాహ్న భోజనం తింటున్నారు.

నిలిచిన మిడ్ డే మీల్స్ బిల్లులు..

యద్దనపూడి/మార్టూరు/కారంచేడు/చినగంజాం: ప్రభుత్వ పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చింది. పేరు మార్చినా విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత అంతంత మాత్రంగానే ఉంది. గతంలో ఉన్న మెనూనే అమలు చేస్తుండగా అన్నం ముద్దగా అవుతోంది. ఏప్రిల్, జూన్, జూలై నెలల మిడ్ డే మీల్స్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలానే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయడంతో కొరత ఉంది. పర్చూరు మండలంలో 38, ఇంకొల్లులో 39, చినగంజాంలో 38, యద్దనపూడిలో 29, మార్టూరులో 51, కారంచేడులో 32 పాఠశాలలు ఉన్నాయి. చినగంజాంలో 3694 మంది, పర్చూరులో 2400, యద్దనపూడిలో 2300, కారంచేడులో 3500, ఇంకొల్లులో 2687 మంది, మార్టూరులో 6500 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 60 శాతం మంది విద్యార్థులు మాత్రమే మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు.

తగిన విద్యార్థుల సంఖ్య– వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత..

నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసింది. దీంతో ఐదేళ్లు చాలా పాఠశాలలో అడ్మిషన్ల కోసం ఎగబడ్డారు. ఎంతగా అంటే తల్లిదండ్రులు స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు పట్టుకొని మరీ పాఠశాలల వద్దకు చేరారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చాక మాత్రం ప్రభుత్వ పాఠశాలు నీరుగారిపోయాయి. యద్దనపూడి మండలంలో 2023-2024లో 2470 మంది కొత్త అడ్మిషన్లు చేరితే ఈఏడాది 2024-25లో 2322 మంది మాత్రమే చేరారు. అంటే 148 మంది సంఖ్య తగ్గిపోయింది. గత ఏడాది 2023-24లో 1524 మంది చేరితే 2024-25లో 1225 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. సుమారు 299 మంది విద్యార్థుల సంఖ్య తేడాగా ఉంది. దీనికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. చీరాల నియోజకవర్గంలో 231, పర్చూరు నియోజకవర్గంలో 104, అద్దంకి నియోజకర్గంలో 86 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తూతూ మంత్రంగా స్టూడెంట్ కిట్ల పంపిణీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అయితే పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసేవారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చాక స్టూడెంట్ కిట్ పేరుతో పింపిణీ చేసింది. అయితే ఈప్రభుత్వం అనుకున్న విధంగా కిట్లు పంపిణీ చేయలేదు. కేవలం ఏదో ఇచ్చాం అన్న విధంగా హడావుడి చేసిందే తప్పా మరొకటి లేదు. కొన్ని మండలాల్లో పిల్లల బూట్ల సైజులు సరిపడా ఇవ్వకపోవడంతో అవి వేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పలు నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య

నియోజకవర్గం	ప్రస్తుత సంఖ్య	ఖాళీలు
చీరాల	1345	231
పర్చూరు	907	104
అద్దంకి	719	86

ఎండీఎం కార్మికులపై టీడీపీ నాయకుల పంజా..

మధ్యాహ్న భోజన పథకం టీడీపీ నేతల నిర్వాకంతో ప్రశ్నార్థకంగా మారింది. కుకింగ్ ఏజెన్సీలను బలవంతంగా రద్దు చేయించడం, రాజీనామా చేయించి టీడీపీ సానుభూతిపరులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సంవత్సరాల తరబడి ఆ పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీలుగా ఉన్నవారిని అర్ధాంతరంగా తొలగించడంతో వారంతా రోడ్డున పడుతున్నారు. దీంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అందడం లేదు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 263 పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో 15,509 మంది ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ కలిపి 1018 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మధ్యాహ్న భోజనం గతంలో వలే లేదు. ఒక వైపు టీడీపీ నాయకులు కొంత మందిని మార్చలని ఒత్తిడి తేవడంతో తమ ఉద్యోగాలు ఊడతాయో ఉంటాయనే ఆందోళనలో ఉన్నారు.

పాఠశాల భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి..



నాడు–నేడు పథకంలో జాప్యం వలన పాఠశాల భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేసి విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా చూడాలి. మార్టూరు మండలంలో 4320 కౌలు రైతు కార్డులు ఈఏడాది ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించగా ఇప్పటివరకు కేవలం 1320 కార్డులు మాత్రమే అధికారులు పంపిణీ చేశారు. దీనివల్ల కౌలు రైతులు నష్టపోయే ప్రమాదం చాలా ఉంది. వీఆర్వోలు తమ విధులు సక్రమంగా నిర్వహిస్తే కౌలు రైతు కార్డులు పూర్తి చేయడం పెద్ద విషయం ఏమీ కాదు.

– రాంబాబు, రైతుసంఘం నాయకుడు

మార్చి నెల వరకు నిధులు విడుదలయ్యాయి..

కారంచేడు, పర్చూరు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని పారిశుద్ధ్య కార్మికులతో పాటు, మధ్యాహ్న భోజన పథకం (కుకింగ్ ఏజెన్సీ) నిర్వాహకులతో మార్చి నెల వరకు మాత్రమే నిధులు విడుదలయ్యాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన తరువాత నుంచి నిధులు విడుదల అవ్వాల్సి ఉంది.

– ఎం సత్యన్నారాయణ, ఎంఈవో, కారంచేడు

తెలుగు తమ్ముళ్ల పరస్పర ఫిర్యాదు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు తెలుగుదేశం పాలకవర్గంలో కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి ఒక వర్గంగా ఉంటే, గ్రామ వార్డు సభ్యురాలు పాతూరి ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ యార్లగడ్డ రత్తయ్యచౌదరిలు మరో వర్గంగా ఉన్నారు. ఈ క్రమంలో గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల టెండర్ల విషయంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న ఆదిపత్య పోరులో ఒకరిపై మరొకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో రెండు కేసులు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు. సర్పంచ్ శివపార్వతి తనను కులం పేరుతో దూషించడమే కాకుండా, తన విధులకు ఆటంకం కలిగించి చెప్పడానికి వీలుకాని పదజాలంతో దూషించారని పాతూరి ఆదిలక్ష్మి, యార్లగడ్డ రత్తయ్యచౌదరి, మరికొంత మందిపై చేసిన ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. అలాగే సర్పంచ్ బాలిగ శివపార్వతి, ఆమె భర్త బాలిగ శ్రీనివాసరావు, ఆమె మరిది బాలిగి బ్రహ్మయ్యలు తమను బెదిరించి, అసభ్య పదజాలంతో దూషించారని చేసిన ఫిర్యాదుతో వారిపైన కేసు నమోదు చేశామన్నారు. పాలక వర్గం నుంచి వచ్చిన రెండు ఫిర్యాదులను పరిశీలించి కేసులు నమోదు చేశామన్నారు.

19న జాతీయస్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలు

చీరాల టౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19న చీరాల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నామని కమిటీ చైర్మన్ ఎస్. సురేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఫొటోగ్రఫీ పోటీల్లో కలర్ (ఓపెన్), మోనోక్రోం (ఓపెన్), మదర్ అండ్ చైల్డ్ (కలర్) విభాగాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో విభాగానికి 4 ఫోటోలను చీరాల కెమెరా క్లబ్ మెయిల్‌కు పంపించాలని సూచించారు. వివరాలకు 98482 42634, 99487 93626 నంబర్లను సంప్రదించాలని ప్రతినిధులు సూచించారు.

7న డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఈనెల 7న జవహర్ విజ్ఞాన కేంద్రం, బాపట్ల జిల్లా మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. మురళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాల పరిసర ప్రాంత యువతీ, యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీఐ, టెన్త్, ఇంటర్, బీటెక్, ఎంబీఏ, పీజీ వరకు చదువుకున్న 18–35 సంవత్సరాల్లోపు వారు తమ పూర్తి వివరాలను కళాశాలలోని జేకేసీ కో–ఆర్డినేటర్ ఎస్.సాయిప్రసన్నకు అందించాలన్నారు.

త్రివిక్రమస్వామిని దర్శించుకున్న జడ్జి



స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న పూజారి

చినగంజాం (పర్చూరు): పర్చూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పి శాంతి చెరుకూరులోని త్రివిక్రమ, అగస్త్యేశ్వరస్వామి వార్ల దేవాలయాలను సందర్శించారు. సోమవారం జడ్జి దంపతులు తమ కుమార్తెతో కలిసి ఆలయానికి వెళ్లి స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జి దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

చినగంజాం: తాగునీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ అమీన్‌గర్ మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. తమ ప్రాంతంలో గత మూడు నెలలుగా మంచినీరు అందక అల్లాడుతున్నామని మహిళలు తెలిపారు. మంచినీరు లేక నోరుఎండిపోతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగిన వారు వచ్చి ఫొటోలు తీసుకుని వెళ్తున్నారే తప్ప ఇప్పటివరకు సమస్యకు పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామనికి రావాల్సిన నీటిని ఎగువ ప్రాంతానికి చెందిన వారు అక్రమంగా నీటి చౌర్యం చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. తాగునీరు దొరక్క ట్యాంకర్ నీరు రూ.1000 పెట్టి కోనుక్కోవాల్సి వస్తోందని మహిళలు, గ్రామస్తులు వాపోయారు. కిలోమీటర్ల దూరం నుంచి నీటిని బిందెలతో మోస్తున్నా సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

యోగాలో చందలూరు విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జే.పంగులూరు: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 4వ తేదీన ఒంగోలు పీవీఆర్ హైస్కూల్‌లో 49వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు జరిగాయి. పోటీల్లో పాల్గొన్న చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 10,12 సంవత్సరాల విభాగంలో అమ్మిశెట్టి లిఖిత మొదటి స్థానం సాధించింది. 14 ఏళ్ల విభాగంలో నాయపాము శృతి మొదటి స్థానం సాధించింది. బాలుర విభాగంలో ఎం వెంకటేష్ ప్రథమ స్థానం సాధించారు. యోగ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులను సోమవారం పాఠశాల హెచ్ఎం శ్రీమతి గిరిజ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడ్డగడ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు క్రీడాకారులను, పీఈటీ ప్రతిమను అభినందించారు.

వార్డు మెంబర్ మృతి



మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన ఒకటో వార్డు మెంబర్ తాటిపర్తి గంగిరెడ్డి (57) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన మృతికి మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీభద్రారెడ్డి, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్లు కోయి అంకారావు, వై.రత్నారెడ్డి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, పంచాయితీ మెంబర్లు, ఈవో లక్ష్మీకాంత్ సంతాపం తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి



తహశీల్దార్ వాసంతితో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మార్టూరు: దశాబ్ద కాలంగా మండలంలోని రెండు గ్రామాల్లోని వందలాది రైతుల భూ సమస్యలను పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం మండల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని జంగమహేశ్వరపురం గ్రామంలో 2535 ఎకరాలు, లక్కవరం గ్రామంలో 565 ఎకరాలు మొత్తం 3100 ఎకరాల వ్యవసాయ భూమి 1306 మంది రైతుల అధీనంలో ఉంది. 2013 నుంచి ఈ భూములకు సంబంధించిన క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల నష్టపరిహారం తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులు పొందలేకపోతున్నారని సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని వారు తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే రామకోటేశ్వరరావు మండల కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి, ఇతర నాయకులు బత్తుల హనుమంతరావు, నాయుడు శ్రీనివాసరావు, రామాంజనేయులు మోహన్ రావు, బి సూరిబాబు పాల్గొన్నారు.

త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్‌లు

బల్లికురవ: వ్యవసాయానికి సంబంధించి రైతుల దరఖాస్తులను ప్రత్యేక ప్రాధాన్యతతో వెంటనే అంచనాల తయారీతో కనెక్షన్‌లు ఇవ్వాలని ఆ శాఖ అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ఆదేశించారు. సోమవారం బల్లికురవలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో అదాలత్ నిర్వహించారు. మండలంలోని 7 సబ్‌స్టేషన్‌ల పరిధిలోని రైతులు పాల్గొని సమస్యలు తెలియజేశారు. 25 కేవీ ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ముగ్గురు లేదా నలుగురు రైతులకు కలిపి వ్యవసాయ కనెక్షన్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. బల్లికురవ సంతమాగులూరు మండలాల్లో 750 కనెక్షన్‌లు మంజూరుకాగా మరో 750 దరఖాస్తులకు కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉన్నట్లు ఆశాఖ డీఈఈ ఎం సురేంద్రబాబు ఈఈ దృష్టికి తెచ్చారు. విద్యుత్ అక్రమ వాడకం చట్టరీత్యా నేరమని నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదుతో జరిమాన విధిస్తామని ఈఈ హెచ్చరించారు. 26 మంది రైతులు తమ సమస్యలను అదాలత్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఈ ఎం సురేంద్రబాబు, ఏఈలు పీ. శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

మార్టూరు: ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న ప్రమాదంలో సోమవారం మార్టూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ ఎం శేషగిరిరావు వివరాల మేరకు.. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన గుడాల అశోక్‌రెడ్డి మార్టూరు మండలం జంగమహేశ్వరపురం పరిధిలో డైరీ ఫారం నడుపుతున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన అరుణ్ కుమార్, రెజీనా భార్యాభర్తలు డైరీ ఫారంలో పనిచేస్తున్నారు. ఈ దంపతులు ఈనెల మూడో తేదీ బైకుపై అద్దంకి మండలం రెడ్డిపాలెం గ్రామం నుంచి సరుకులు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో అద్దంకి మండలం శింగరకొండపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆటోలో అతివేగంగా రాంగ్ రూట్లో వస్తూ సాయి చందన స్టోన్ క్రషర్ ఎదురుగా బైకును బలంగా ఢీకొట్టారు. ప్రమాద తీవ్రతకు అరుణ్ కుమార్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకోగా రెజీనాకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఒంగోలులోని ఉపాస్ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం అరుణ్ కుమార్ కోమాలో ఉన్నట్లు అశోక్‌రెడ్డి తెలిపారు. ఒంగోలు పోలీసులు ఇచ్చిన వివరాలతో సోమవారం స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

జే.పంగులూరు: మండల తహశీల్దార్‌గా సోమవారం డీ నాగరాజారావు బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు తహశీల్దార్‌కు డిప్యూటీ తహశీల్దార్ ఆదినారాయణ, వీఆర్‌ఓలు పుష్పగుచ్ఛం అందించారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో తహశీల్దార్ నాగరాజారావు చిత్తూరు జిల్లా తిరుపతిలో పనిచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాన్నాడు.

ఒన్‌టౌన్ సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

చీరాల: చీరాల ఒన్‌టౌన్ సీఐగా మారేడు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేసిన బి.శేషగిరిరావు బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయనకు స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది స్వాగతం పలికారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, అసాంఘిక కార్యకలాపాలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు.

బల్లికురవ: బల్లికురవ తహశీల్దార్‌గా కవిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా అమృతలూరులో ఎన్నికల విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారు. కార్యాలయ డీటీ రవికుమార్, ఎఎస్‌వోర్ అమర్‌నాథ్, వీఆర్‌వోలు కవితకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చెస్తానని ఆమె చెప్పారు.

స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

చీరాల: స్థల పంచాయతీలు ఇరువర్గాల మధ్య విభేదాలకు దారితీస్తున్నాయి. ఆదివారం సాయంత్రం శ్రీనివాసకాలనీలోని నాలుగు సెంట్ల విలువైన భూమి తమదంటే తమదని బహిరంగ ఘర్షణకు దిగి దాడులకు తెగబడ్డారు. కాలనీలోని విలువైన నాలుగు సెంట్ల స్థలం తనదని ఓ స్టిక్కరింగ్ పాయింట్ యజమాని తన మందీమార్బలంతో రాగా మరో సస్పెండ్ అయిన కానిస్టేబుల్ తాను కొనుగోలు చేశానంటూ వాదనకు దిగారు. చిలికిచిలికి గాలివానలా దాడులకు వరకు వెళ్లింది. అయితే ఎవరు సరైన యజమానులో ధ్రువీకరణ పత్రాలు తీసుకురాకపోవడంతో వివాదం పెద్దదైంది. చివరకు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.